www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 25 ఫిబ్రవరి 2023

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కడప అర్బన్ : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్ఐఒ రమణరాజు తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి మార్చి 7 వరకు రెండు దశల్లో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 101 కేంద్రాలను ఎంపిక చేశామని చెప్పారు. ఇందులో ప్రత్యేక కళాశాలలు 19,ఎయిడెడ్ 6, సాంఘిక సంక్షేమ శాఖ 10, మోడల్ కళాశాలలు 5, ప్రైవేట్ కళాశాలలు 61 ఉన్నాయని తెలిపారు. పరీక్షలు రోజు రెండు విభాగాలుగా ఉంటాయన్నారు. ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందు చేరుకోవాలని చెప్పారు. అన్ని కేంద్రాల్లో అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని ప్రిన్సిపల్స్‌కు సూచించామని తెలిపారు. ఉమ్మడి జిల్లాల్లో ఎంపిసి విద్యార్థులు 9,648, బైపిసి విద్యార్థులు 4,893 మంది హాజరవ్వతారన్నారు. ఇప్పటికే విద్యార్థుల హాల్ టికెట్స్ ఆయా కళాశాలల విద్యార్థులకు ఇచ్చామని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఏకగ్రీవం!

పరిశీలనలో ప్రత్యర్థి నామినేషన్ తిరస్కృతి
వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థికి లైన్ క్లియర్
వైసిపి శ్రేణుల్లో తొలగిన టెన్షన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం దిశగా సాగుతోంది. నామినేషన్ గడువు చివరి రోజున వైసిపి అభ్యర్థి మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి ప్రత్యర్థిగా పోటీ చేయడానికి ఒక నామినేషన్ దాఖలైంది. 24 గంటల్లోపే మరుసటి రోజైన శుక్రవారం నిర్వహించిన స్క్రూటినీలో ప్రత్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావడం అనుమానాలకు తావిస్తోంది. ఎమ్మెల్సీ పదవి దక్కించుకోవాలనే ఉద్దేశంతోనే నామినేషన్లు దాఖలు చేయడం సహజం. కానీ ఇందుకు స్వల్ప సమయంలోనే ప్రత్యర్థి పోటీ చేయడానికి విముఖత వ్యక్తం చేయడం వెనుక దాగిన రహస్యంలోని మర్మమేమిటో తెలియడం లేదు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంలోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ప్రలోభపూరిత ఏకపక్ష ఎన్నికల రాజకీయ పరిశీలకుల నుంచి విమర్శల వర్షం కురుస్తోంది. ఏకగ్రీవ, ఏకపక్ష స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక పరిస్థితుల నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం కావడం అనివార్యంగా మారనున్నట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి తన నామినేషన్ పరిశీలన రోజున తిరస్కరణ కావడం పట్ల ఆసక్తి కనబరచకపోవడం గమనార్హం. వైసిపి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగిన మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి గెలుపునకు లైన్‌క్లియర్ అయినట్లు తెలుస్తోంది. 2017 నాటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మెజార్టీ మద్దతు కలిగిన వైసిపి అభ్యర్థి వైఎస్ వివేకా నందరెడ్డి ఓటమి పాలైన సంగతి తెలిసిందే. టిడిపి అభ్యర్థి బి.టెక్ రవి గెలుపునకు అవలంభించిన పద్ధతులు సంచలనాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. 2017 నాటి క్రైమ్ క్యాలెండర్ ప్రజల స్మృతిపథంలో నుంచి తొలగకముందే 2023 స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం దిశగా నడవడం చర్చనీయాంశంగా మారింది. వైసిపి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతుండడం గమనార్హం.

నామినేషన్ పత్రాలు పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

ప్రజల జీవన స్థితిగతులు అస్తవ్యస్తం

ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

బిజెపి ప్రభుత్వంలో ప్రజల జీవన స్థితిగతులు దిగజారిపోతున్నాయని, దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట 2023-24 కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక వార్షిక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ కడప జిల్లా కమిటీ ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను పేదరికంలోకి నెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపడుతున్నామని చెప్పారు. ప్రజల జీవనో పాధిపై కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం 2023-24 వార్షిక బడ్జెట్లో దాడి చేసిందన్నారు. దేశంలో ఆకలి పెరుగుతోందని, సామాజిక అశాంతి అధికమ వుతోందని తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తి వేగంగా క్షీణిస్తోందని అన్నారు. సర్వీస్ రంగంలో, ఐటీ రంగంలో పెద్ద ఎత్తున లే ఆఫ్ లు, వేతనాల కోతలు ఆపాలని డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు, ఆస్తి పన్ను, చెత్త పన్ను, నీటి పన్ను, గ్యాస్ ధరల పెంపు, యూజర్ చార్జీల పేరుతో ప్రజలపై మోయలేని భారాలు వేశారని, వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు పెంచి, కూలీలకు కూలి రేట్లు పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 75 ఏళ్లుగా అమలు చేస్తున్న ఉచిత ఐదు కేజీల బియ్యం పంపిణీ పేదల పథకాన్ని రద్దు చేశారని వాపోయారు. రేషన్ కార్డుకు ఇచ్చే ఆహార ధాన్యాలు, నిత్యావసర వస్తువులకు సబ్సిడీని ఎత్తివేసారని వెంటనే పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. సాధారణ ప్రజలు నిత్యం వాడే ఔషధాలపై , ఆహార వస్తువులపై, నిత్యవసర వస్తువులపై జిఎస్‌టిని ఉపసంహరించాలని వారు కోరారు. దేశంలో ప్రతి పౌరునికి మంచినీరు ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. దేశంలోని 116 మందికి రూ.11 లక్షల కోట్ల పన్ను రాయితీని ఉపసంహరించుకోవాలని వారి డిమాండ్ చేశారు. బిజెపి అండతో ఆదానీ ఫేక్ సంస్థలు దేశ సంపదను లూటీ చేయడానికి ప్రయత్నిస్తోందని చెప్పారు. కడప జిల్లాలో జిందాల్ ఉక్కు వల్ల ప్రయోజనం స్వల్పమేనని, భారీ ఉక్కు పరిశ్రమ సెయిల్ ఆధ్వర్యంలో పెట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో 10 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని రాష్ట్రంలో రెండు లక్షల 30 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే ప్రతి సంవత్సరం క్యాలెండర్ విడుదల చేసి భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు బి.నారాయణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామమోహన్, బి.మనోహర్, జి.శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగి రిరెడ్డి, వి.అన్వేష్, ఎం.పాపిరెడ్డి, కె.సత్యనారాయణ, సిపిఎం మండల నాయకులు ఎస్.భైరవ ప్రసాద్, పి.చాంద్ బాషా, నరసయ్య, వీరయ్య, ప్రజా సంఘాల నాయకులు శివ కుమార్, ఎం.చిన్ని, ఓబులేసు, డేవిడ్ రాజ్, రాజేంద్ర ప్రసాద్, నాయక్, చంద్రారెడ్డి, రాజామణి , గౌసియా బేగం, నాగేంద్రబాబు, సి.ఆర్.వి.ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి అన్బురాజన్

పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి

- నేర సమీక్షా సమావేశంలో ఎస్‌పి అన్బురాజన్

కడప అర్బన్ : పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌పి అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తీవ్రమైన నేరాలను త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై ఛార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాల్లో వాహన దారులను అప్రమత్తం చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలపై నేరాలు, రాబరీ, డకాయిట్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. ఫోక్సో, మహిళలపై జరిగిన నేరాలపై నిర్ణీత సమయంలో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసుల్లో సమగ్ర విచారించి అదృశ్యమైన వారి ఆచూకీ త్వరగా తెలుసుకోవాలన్నారు. 174 సిఆర్ పిసి(అనుమానాస్పద మృతి) కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు నిఘా పెంచాలన్నారు. నిషేధిత గుట్కా, దేశీ అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణాపై దాడులను ముమ్మరం చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాల వేలానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి(అడ్మిన్) తుషార్ డూడి, ప్రొద్దుటూరు ఎఎస్‌పి ప్రేర్ణాకుమార్ , స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి నీలం పూజిత, జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు **కమాండ్ కంట్రోల్ సిబ్బంది ప్రశంసా పత్రాలు..** పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ప్రశంసా పత్రాలు అందచేసి ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరు, బద్వేలు, జమ్మలమడుగు పట్టణాలలో కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ద్వారా నేరాల నిరోధానికి పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. **జమ్మలమడుగు :** మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వర్తిస్తున్న వినోల్య ఉత్తమ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. శుక్రవారం ఎస్‌పి అన్బురాజన్ చేతుల మీదుగా ఉత్తమ మహిళా పోలీసుగా ప్రశంసాపత్రం అందుకోవడం ఆనందంగా ఆమె అన్నారు. **హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం** జిల్లా పోలీసు కార్యాలయంలో హోమ్‌గార్డుగా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన వై.శ్రీనివాసులు కుటుంబానికి ఎస్‌పి అన్బురాజన్ రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని మృతుని సతీమణి రమాదేవికి చెక్కు రూపంలో అందజేశారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

28న 'జానమద్ది' వర్ధంతి

కడప అర్బన్ : సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో ఈ నెల 28న ఉదయం 10:00 గంటలకు గ్రంథాలయ వ్యవస్థాపకులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి నవమ వర్ధంతి, స్మారకోపన్యాసం నిర్వహించనున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసి ఆచార్య రంగ జనార్దన, సభాధ్యక్షులుగా యోగి వేమన విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య, ప్రధాన వక్తగా పంచసహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ (తిరుపతి), విశిష్ట అతిథులుగా శ్రీ అచలానంద ఆశ్రమం పీఠాధిపతులు స్వామి విరజానంద (బ్రహ్మంగారి మఠం), యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శ్రీనివాస్, పూర్వ శాసనమండలి సభ్యులు పోచంరెడ్డి సుబ్బారెడ్డి, జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ పాల్గొంటారన్నారు.

ఎంపికైన హ్యాండ్‌బాల్ క్రీడాకారులు

హ్యాండ్ బాల్ క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - కడప అర్బన్

హ్యాండ్ బాల్ క్రీడలో రాణించే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ కె. చిన్నపరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని డిఎస్‌ఎ క్రీడామైదానంలో జిల్లాస్థాయి జూనియర్ బాలుర విభాగం ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హ్యాండ్ బాల్ క్రీడను ఉన్నతస్థానానికి తీసుకువెళ్తామన్నారు. రాష్ట్రంలోనే జిల్లా జట్టు ఆదర్శంగా ఉండేలా ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. శిలకు ఉలిదెబ్బ తగిలితేనే శిల్పమవుతుందని, క్రీడాకారుడు చెమటోడిస్తేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులకు ఈనెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. క్యాంపులో ఉత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తుదిజట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు కె. ఎన్. సమరనాథరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో క్రీడలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. గౌరవ అతిథిగా విచ్చేసిన పోతుల ట్రస్టు చైర్మన్ పోతుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి తనవంతు సహకారం రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులకు క్రీడాదుస్తులు, రవాణా ఛార్జీలు చెల్లించనున్నట్లు ప్రకటించారు. జియోన్ వ్యాయామ కళాశాల వ్యవస్థాపకులు కె. రాజారత్నం ఐజాక్ మాట్లాడుతూ క్రీడల్లో జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. జిల్లా నుంచి ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించారని సూచించారు. అంతర్జాతీయ హ్యాండ్ బాల్ క్రీడాకారుడు సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ ఆట పట్ల అంకితభావం, సాధించాలన్న తపన, క్రమం తప్పని సాధన ఉత్తమ క్రీడాకారులుగా రాణించేందుకు దోహదం చేస్తాయన్నారు. జిల్లా హ్యాండ్ బాల్ సంఘం కార్యదర్శి ఎ. సింధూరి మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు మార్చి 3, 4, 5 తేదీల్లో కర్నూలులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకుని ఎంపికలను ప్రారంభించారు.డిఎసి హ్యాండ్ బాల్ కోచ్ మునాఫ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. రాజశేఖర్, సీనియర్ క్రీడాకారులు సాయికిశోర్ రెడ్డి, శివప్రసాద్, రాజగోపాల్ రెడ్డి సెలక్షన్ కమిటీ సభ్యులుగా జిల్లా జట్టుకు ప్రాబబుల్స్ ఎంపిక చేశారు. కార్యక్రమంలో జియోన్ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ రోడా మెర్సీ, మన్సూర్ అలీఖాన్ పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు.. చాంద్ బాషా, ప్రతాప్, ఉదయకుమార్, విక్రమ్ కల్యాణ్, వెంకటశివకుమార్, వెంకటకృష్ణారెడ్డి, ఈశ్వర్, గురువర్ధన్, నాగేంద్ర, రజాక్, సునీల్ రెడ్డి, ఆదర్శ్, సాయికిరణ్, విజయరాజ్, మోహన్ నాయక్, ఆదిశేషారెడ్డి, విష్ణువర్ధన్, అబ్దుల్ రహీం, అక్బర్, ప్రసాద్, మురళీకృష్ణ, వెంకటశ్రీరామ్ జిల్లా ప్రాపబుల్‌కు ఎంపికయ్యారు.

రేపు నెలనెలా సీమ సాహిత్యం సదస్సు

ప్రజాశక్తి కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 117వ సదస్సును ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 117వ సదస్సులో 'విద్వాన్ గానుగపెంట హనుమంతరావు జీవితం - సాహిత్యం' అనే అంశంపై పుట్టపర్తి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం (ప్రొద్దుటూరు) ప్రసంగిస్తారని తెలిపారు.

ప్రాణ భద్రత.. సామాజిక బాధ్యత : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ప్రజల ప్రాణ భద్రత మనందరి సామాజిక బాధ్యత అని, ఆ దిశగా జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తం, మన్వయంతో పని చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధితాధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ ల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతన్నారని పేర్కొన్నారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్యాత్యేక దృష్టి సారించి వాహన ప్రమాదాలను అరికట్టే దిశగా భద్రత చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్, రవాణా, ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖల అధికారులు ఐరాడ్ ద్వారా ప్రతీ రోడ్ ప్రమాదానికి గల కారణాలను, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు విధిగా నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో జాతీయ రహదారుల పరిధిలో 60, రాష్ట్ర రహదారుల పరిధిలో 4 బ్లాక్ స్పాట్లను గుర్తించారని, వాటికి సంబంధించి ఆయా శాఖల పరిధిలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పెట్రోల్ బాంక్ వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇంజినీరింగ్ శాఖల వారిగా వారి సంబంధిత రహదారులపై గత నెలలో జరిగిన ప్రమాదాలను విశ్లేషించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వారికి అన్ని సమయాల్లో అత్యవసర చికిత్సలు అందించేందుకు నగరంలోని శ్రీశ్రీహోలిస్టిక్, సన్ రైస్, హిమాలయ ఆసుపత్రులకు అనుమతులు ఇచ్చామన్నారు. ప్రమాదాల్లో వాహన డ్యామేజీ, క్షత గాత్రులైన ప్రయాణికులను మేజర్, మైనర్, నాన్ ఇంజురీ అనే కేటగిరీలుగా విభజించి వివరాలను రికార్డు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌పి అన్బురాజన్, కమిటీ మెంబర్ కన్వీనర్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మీరా ప్రసాద్, ఆర్‌టిఒ సుశీల, ట్రాఫిక్ పోలీసు అధికారులు, ఎంవిఐలు, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, డిసిహెచ్‌ఎస్ మెడికల్ సూపరింటెండెంట్, ఆర్అండ్‌బి, విద్యుత్ శాఖల ఎఇలు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హై వేస్ అధికారులు, రోడ్ సేఫ్టీ డిఎస్‌పి ఇరాడ్, జిల్లా కో-ఆర్డినేటర్, రోడ్డు భద్రత ఎన్‌జిఒ అధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జమీల్ మొబైల్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మొబైల్ అధినేత జమీల్ కోరారు. శుక్రవారం షాహిదర్బార్ ఫంక్షన్ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26న బెల్లం బండిలో ఉన్న హాజరత్ ఆయేషా మోడల్ స్కూల్లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. విద్యా సాధన కళాశాల కరస్పాండెంట్ పి.మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ అన్ని రకాల జబ్బులకు వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. నగర ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జన వికాస సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు తాహిర్ మాట్లాడుతూ ఉచిత వైద్యంతో పాటు మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నారని చెప్పారు. దాదాపు 15 మంది ప్రముఖ వైద్యులు శిబిరాన్ని హాజరవుతున్నారని తెలిపారు. ఖూన్ కా రిస్తా వ్యవస్థాపకులు తారీకు ఆలీ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరానికి తమ సహాయ సహకారాలను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అఖిల్ అహ్మద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కళాశాల సంయుక్త సంచాలకులు డాక్టర్ పి.బాబు

ప్రజాశక్తి - కడప

పర్యావరణ అని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిది అని జోన్ -4 ఆర్జెడి, కళాశాల సంయుక్త సంచాలకులు డాక్టర్ పి. బాబు, సెమినార్ కన్వీనర్ డాక్టర్ పి నాగేశ్వర రెడ్డి అన్నారు. కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో శుక్రవారం ఐసిఎస్‌ఎస్ఆర్ వారి సహకారంతో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'కాలుష్య నియంత్రణ, స్థిరమైన పర్యావరణం' అనే అంశంపై రెండు రోజుల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంయుక్త సంచాలకులు డాక్టర్ పి. బాబు, సదస్సు కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, ప్రొఫెసర్లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం ఏ ఒక్కరి బాధ్యతో కాదు, అందరూ సమిష్టిగా నిర్వహించాలని అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఇది విద్యార్థులందరూ విధిగా పర్యావరణంపై దృష్టి సారించాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ పరిశోధకులకు, విద్యార్థులకు ఉపయోగపడే మంచి అంశాన్ని సదస్సుకు ఎంచుకున్నారని అభినందించారు. సదస్సు ముఖ్య ఉద్దేశాన్ని సదస్సు సంచాలకులు డాక్టర్ సి. నాగేశ్వరరెడ్డి కూలంకుశంగా విశ్లేషిస్తూ దాదాపుగా వందకు పైగా పత్రాలు అందాయని, వీటన్నింటినీ ఐఎస్‌బి ఎన్ నంబర్తో సావనీర్ గా ప్రచురిస్తామని తెలిపారు. సదస్సులో ముఖ్య వక్తలుగా కెమిస్ట్రీ ఐఐటి తిరుపతి డాక్టర్ కుమారస్వామి రెడ్డి, వైవీయూ డిపార్ట్మెంట్ ఆఫ్ ఎన్విరాల్‌మెంట్ సైన్స్ డాక్టర్ టి. చంద్రశేఖర్, వైవీయూ ప్రొఫెసర్ ఎం వి శంకర్ పాల్గొని ప్రసంగించారు. సదస్సులో ప్రభుత్వ పురుషుల కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జె. వెంకటలక్ష్మి, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

ఆదివాసి స్కూల్ పిల్లలకు చేయూత

ప్రజాశక్తి - కడప

ఝార్ఖండ్ రాష్ట్రంలో ఆర్గోల్ వంజా మేరీ ఛారి టబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న మార్నింగ్ బెల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పిల్లలకు ప్రిన్స్ వంజా చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015 లో ఎవిఎం సంస్థ ఆదివాసి పిల్లల కోసం స్కూల్ నడుపుతోందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతో కృషి చేసి పాఠశాలను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కరోనా కారణంగా ఎన్నో పాఠశాలలు మూతపడిన సమయంలో తమ సంస్థ ఆ విపత్తుని ఎదుర్కొని ఆదుకున్నామని చెప్పారు. మంచి విద్యను అందించడం తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇందుకు సహకరిస్తున్న ఎందరో దాతలకు తమ సంస్థ రుణపడి ఉందని అన్నారు. మరిన్ని సేవ కార్యక్రమాల ద్వారా తమ సంస్థ ముందుకెళ్తుందని ప్రిన్స్ వంజా అన్నారు. ఈ సందర్భంగా బడి పిల్లలకు లంచ్ బాక్సులు అందజేశారు. ఝార్ఖండ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సంగీత హోరో, ప్రధానోపాధ్యురాలు ఎమిలీ డాంగ్ , అధ్యాపకులు, పిల్లలు పాల్గొన్నారు.

బడి పిల్లలతో ప్రిన్స్ వంజా

ఎఐసిసి ప్లీనరీలో బొజ్జా తిరుమలేష్

కడప : చత్తీస్‌ఘర్ రాష్ట్ర రాజధాని రాయపూర్‌లో ఈనెల 24, 25, 26 తేదీల్లో నిర్వహిస్తున్న ఎఐసిసి ప్లీనరీ సమావేశానికి కడప జిల్లా, కమలాపురం నియోజకవర్గానికి చెందిన పిసిసి డెలిగేట్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ వెళ్లారు. మూడు రోజులపాటు పాటు నిర్వహించే సమావేశంలో ఆయన పాల్గొంటారు.

రాజీవ్ పార్క్‌లో పనులు పరిశీలన

కడప అర్బన్ : నగర అభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనులను కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ శుక్రవారం పరిశీలించారు. రాజీవ్ పార్క్, రాజీవ్ మార్గ రోడ్డు పనులలో భాగంగా రాజీవ్ పార్క్‌లో న్యూ మోడల్ లైట్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. లాన్ ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు ఆదేశించారు. పార్క్‌లో మొక్కలను నాటించాలని, డ్రైన్ ఏర్పాట్లు చేయాలని, టాయిలెట్స్‌లో డోర్స్ సిద్ధం చేయాలని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయించి ఇరువైపులా పాతవే పూర్తి చేయించాలని తెలిపారు. కాలువలను త్వరగా పూర్తి చేసి డివైడర్లు, లైట్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు.

పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-కాశినాయన

అంగన్వాడీ కేంద్రాలలోని పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి ప్రశాంతి తెలిపారు. శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషియన్‌లో భాగంగా నరసాపురం, మిద్దెల గ్రామాలలో వారు పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. మిద్దెల గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. అంగన్వాడీ టీచర్ సౌభాగ్యమ్మకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిర్మల, ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, సుబ్బరాయుడు, పబ్లిక్ హెల్త్ నర్స్ శారద, ఆరోగ్య పర్యవేక్షకులు బాలయ్య, నాగమణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో వైద్య పరీక్షలుచేస్తున్న వైద్యాధికారి ప్రశాంతి

'సీమ'కే తలమానికం జెబి ఆర్థో ఆస్పత్రి

ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మేయర్ సురేష్ బాబు, వైసిపి నేత అహ్మద్ బాషా

ప్రజాశక్తి-కడప సిటీ

రాయలసీమకే తలమానికం జెబి ఆర్థో ఆస్పత్రి అని, అమెరికా లాంటి అగ్రరాజ్యాల్లో ఉన్నటువంటి అత్యాధునిక టెక్నాలజీతో కడప నగరానికి అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమని మేయర్ సురేష్‌బాబు, వైసిపి నేత అహ్మద్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా సింహపురి కాలనీలో ఏర్పాటు చేసిన జెబి ఆర్థోకేర్ మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రిని వారు ప్రారంభించారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ఒకటిన్నర దశాబ్దంగా ప్రముఖ ఆర్థో వైద్యులు జహంగీర్ హిమాలయ, తిరుమల వంటి ఆస్పత్రుల్లో ఎముకల విభాగంలో అత్యంత ప్రావీణ్యత సంపాదించారని చెప్పారు. అసాధ్యమన్న సర్జీలను సైతం అవలీలగా సుసాధ్యం చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేకత చాటుకున్నారని పేర్కొన్నారు. అలాంటి నిష్ణాతులైన జహంగీర్‌బాషా దంపతుల ఆధ్వర్యంలో సీమకే తలమానికంగా నిలిచేలా ఆర్థో సేవలను కడప నగరానికి తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం ఆస్పత్రి అధినేతలు జహంగీర్‌బాషా, జయభారతి మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో పూర్తి ఆర్థోపెడిక్ చికిత్సలు చేస్తామన్నారు ముఖ్యంగా ప్రైమరీ, రివిజన్ రీ ప్లే స్మెంట్, కీ హోల్, కాంప్లెక్స్ ట్రామ కండిషన్లకు అత్యాధునిక పరికరాల చేత ఆపరేషన్లు చేస్తామన్నారు. మునుపెన్నడి లేనివిధంగా రాయలసీమ లోనే మొట్టమొదటి సారిగా రీ జనరేటివ్ ఆర్థోపెడిక్ సెంటర్, అడ్వాన్స్ రుమటాలజీ నెలకొల్పామని చెప్పారు. నగర ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ విశ్రాంత ఉద్యోగి, రమేష్ రెడ్డి, గాయత్రి నేత్రాలయ కంటి వైద్య నిపుణులు డాక్టర్ శశిబిందు, ఎస్ఆర్ఎస్ డయాగ్నోస్టిక్ అధినేత డాక్టర్ వంశీకృష్ణ (సెవెన్రోడ్స్), డాక్టర్ ప్రమోద్, డా. సతీష్, డాక్టర్ విజయనరసింహారెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ శివానందరెడ్డి, డాక్టర్ క్రాంతి, డాక్టర్ ఉబేదుల్లా, డాక్టర్ వెంకటేశ్వర్లు, శాంతినికే తన్ కరస్పాండెంట్ ఇలియాస్ రెడ్డి, జనవికాస్ సేవా సమితి అధ్యక్షులు ఎస్.ఎం.డి తాహీర్, వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బిసి నాయకులు పసుపులేటి మనోజ్ కుమార్, కార్పొరేటర్ భాస్కర్ వర్మ, శ్రీరంజన్, ఆస్పత్రి బయ్య, ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న అహ్మద్‌బాష, మేయర్ సురేష్‌బాబు, అతిథులతో జహంగీర్‌బాషా, జయభారతి

కాలువలో నిలిచిన వ్యర్థ నీరు

పంట కాలువలోకి వ్యర్థ నీరు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సిద్ధారెడ్డిపల్లి పంచాయతీ ద్వారకానగరం వద్ద నున్న పంట కాల్వలోకి వ్యర్థ నీరు వచ్చి చేరింది. గ్రామ సమీపంలోని పాల కేంద్రం నుంచి వ్యర్థ నీరు వస్తుందని ప్రజలు వాపోయారు. పాల కేంద్రంలో శుభ్రం చేసిన వ్యర్థ నీటిని బయటకు వదులుతూ ఉండడంతో అవి కాలువలోకి చేరి కెసి కెనాల్‌లో కలుషితమవుతున్నాయి. గ్రామానికి మంచినీటి సరఫరా చేసే బోరు సమీపంలోకి ఈ నీరు వచ్చి చేరుతోందని, దీంతో తాగునీరు కూడా కలుషితమయ్యే ప్రమాదముందని స్థానికులు వాపోయారు. వ్యర్థ నీటి వల్ల దుర్వాసన వస్తోంది. ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాక్టరీ నుంచి విడుదల చేసిన నీటిలో దుర్వాసన అధికంగా వస్తుండటంతో రోగాలు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మురుగునీరు పంట కాలువలోకి వదలకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సబ్సిడీతో డ్రోన్‌లు మంజూరు

చాపాడు : వ్యవసాయంలో పెరుగుతున్న ఆధునికీకరణలో భాగంగా వచ్చిన డ్రోన్ లను రైతులకు సబ్సిడీతో పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. డ్రోన్ల ద్వారా క్రిమి సంహారక మందులు పంట పొలాలకు పిచికారి సులభంగా చేసుకోవచ్చని తెలిపారు. రూ.10 లక్షల విలువ చేసే డ్రోన్లను రైతు సిహెచ్‌సి గ్రూపులకు 40 శాతం సబ్సిడీతో మంజూరు చేస్తుందన్నారు. ఎజిబిఎస్, డిప్లొమా పూర్తి చేసిన వారికి 50శాతం సబ్సిడీతో మంజూరు చేస్తుందన్నారు. కావాల్సిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తథ్యం : పిసిసి

వేంపల్లె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాల వల్ల నలిగి పోతున్న ప్రజలు కాంగ్రెసు పార్టీకి ఆకర్షణ అవుతున్నారని కాబట్టి కాంగ్రెస్ పార్టీకి రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో పూర్వ వైభవం రావడం తథ్యమని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ 52 లోక్ సభ స్థానాల్లో గెలిచిందని చెప్పారు. ఇండియా టుడే – సి ఓటర్ తాజా సర్వే ప్రకారం ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ కు 191 స్థానాలు వస్తాయని తేలిందని చెప్పారు. దీని బట్టి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ గణనీయంగా పుంజుకొన్నట్లు తెలుస్తుందని చెప్పారు. రాష్ట్రంలో వైసిపి పరిస్థితి రోజురోజుకూ దిగజారుతున్నట్లు చెప్పారు. జనవరిలో ఐ ప్యాక్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్ర కేబినెట్‌లో ఉన్న 25 మంది మంత్రుల్లో 20 మంది ఓడిపోతారని చెప్పారు. 13 మంది మాజీ మంత్రుల్లో 11 మంది ఓడిపోతారని తేలిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రత్యేకహోదా, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారన్నారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి వైభవం వస్తుందని తులసిరెడ్డి ఆశా భావం వ్యక్తం చేశారు.

రేపు తేక్వాండో జిల్లా స్థాయి పోటీలు

పోరుమామిళ్ల టౌన్ : స్థానిక సిరి ఫంక్షన్ హాల్‌లో న్యూ ఆంధ్రప్రదేశ్ తేక్వాండో అసోసియేషన్ అధ్యక్షతన ఆదివారం జిల్లా స్థాయి సబ్ జూనియర్, కేడిట్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా తేక్వాండో ప్రధాన కార్యదర్శి నాయాబ్ రసూల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పకుండా వారి ఆధార్ కార్డ్, జనన ధృవీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు.

ఉపాధ్యాయులకు సలహాలు ఇస్తున్న లిప్ మానిటరింగ్ అధికారి

ఉపాధ్యాయులే కీలకం

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యాభ్యాసంలో వెనుకబడిన విద్యార్థుల్లో అభ్యసనను మెరుగుపరచడంలో ఉపాధ్యాయులే కీలకమని లిప్ మానిటరింగ్ అధికారి చెరుకూరి శ్రీనివాసులు చెప్పారు. శుక్రవారం వేంపల్లెలోని ఉర్దూ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రాక్టీస్ పిరియడ్ ఎలా నిర్వహించాలో అనే వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అందించే విద్యా బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వెనుకబడిన విద్యార్థులకు చదవడం, రాయడం వాటిపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. అభ్యసనను మెరుగుపరచడంలో ఉపాధ్యాయులు అశ్రద్ధ వహించవద్దని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్తీ పెట్రోలు విక్రయిస్తే చర్యలు

వేంపల్లె : పెట్రోల్ బంకుల్లో వాహనాదారులకు కల్తీ పెట్రోలు, డీజిల్ విక్రయిస్తే అలాంటి పెట్రోలు బంకు యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలోని పులివెందుల రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకులో తహశీల్దారు తనిఖీలు చేపట్టారు. పెట్రోలు స్టాక్ వివరాలతో పాటు వాహన దారులకు విక్రయించే ధరలను నిర్వహకులతో అడిగి తెలుసుకున్నారు. అలాగే పెట్రోల్‌ను పరిశీలించారు. పెట్రోలు బంకుల్లో వాహనాదారులకు మౌలిక సదుపాయాలైన తాగునీరు, బాత్ రూమ్‌లు కచ్చితంగా ఉండాలని సూచించారు. గాలి మిషన్ కూడా ఉండాలని సూచించారు. ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని సూచించారు. వాహనాదారులకు నాణ్యమైన పెట్రోలు, డీజిల్ విక్రయాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, విఆర్ఓలు పాల్గొన్నారు. **ఎర్రగుంట్లలో..** మండల పరిధిలోని పొట్లదుర్తి, చిలమకూరు, ఎర్రగుంట్లలోని పెట్రోల్ బంకులను శుక్రవారం తహశీల్దార్ నాగేశ్వరరావు తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పెట్రోల్ బంకులను తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రెండు దుకాణాలు దగ్ధం
- రూ.2 లక్షల ఆస్తి నష్టం

పులివెందుల రూరల్ : పట్టణంలోని పార్నపల్లి రోడ్డు రాజారెడ్డి కాలనీ సమంలో శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూతో రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. బాధి తుల కథనం మేరకు... రాజారెడ్డి కాలనీ వద్ద రజియా టిఫిన్ సెంటర్, మా బాష సర్వీసింగ్ సెంటర్‌లున్నాయి. దుకాణ దారులు రాత్రి పనులు ముగిం చుకొని షాపు మూసి వేసి యధావిధిగా ఇంటికి వెళ్లారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. ఈ మంటలను చుట్టుపక్కల వారు చూసి అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేశారు. వెంటనే ఫైర్ సిబ్బంది అగ్నిమాపక యంత్రంతో వచ్చి మంటలు అదుపు చేశారు. కానీ అప్పటికే సర్వీసింగ్ సెంటర్‌తో పాటు టిఫిన్ అంగడి పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షలకుపైగా ఆస్తి నష్టం సంభవించినట్లు దుకాణం యజమానులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

కర్ణాటక మద్యం బాటిళ్లు స్వాధీనం

ముద్దనూరు : ముద్దనూరు –తాడిపత్రి ప్రధాన రహదారిలోని చింతకుంట గ్రామ సమీపంలో ఉన్న డాబా వద్ద సుబ్బన్న అనే వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ ఉన్న కర్ణాటక మద్యం బాటిళ్లు శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్ర మోహన్ తెలిపారు. చింతకుంట గ్రామానికి చెందిన సుబ్బన్న డాబా వద్ద కర్ణాటకకు చెందిన 14 మద్యం బాటిళ్లు కలిగి ఉన్నట్లు చెప్పారు. బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ తరలించామన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

శిథిలావస్థలో విద్యుత్ శాఖ సమూహ భవనాలు
నెర్రెలు వారిన గోడలు, పెచ్చులూడుతున్న పైకప్పు
భయాందోళనలో అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి- జమ్మలమడుగు

మండల కేంద్రంలోని విద్యుత్ భవనం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో చెప్పలేని దుస్థితిలో ఉంది. నెర్రెలు పడ్డ గోడలు, హెచ్చులుడుతున్న పైకప్పు, వర్షం వస్తే ఊరిస్తున్న వైనం, కనీస వసతులు కొరత.. తదితర సమస్యలతో జమ్మలమడుగు విద్యుత్ శాఖ ఏడీ, ఎఇ కార్యాలయాలు సమూహ భవనాలు కొట్టిమిట్టాడుతున్నాయి. విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయం, జమ్మలమడుగు అర్బన్ ఎఇ కార్యాలయం, జమ్మల మడుగు రూరల్ ఎఇ కార్యాలయం, పెద్దముడియం ఎఇ కార్యాలయం, విద్యుత్ బిల్లులు కార్యాలయాలు ఇక్కడ ఉన్నాయి. ఈ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలంటే ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ సిమెంటు పెచ్చులూడి తలపై పడతాయో అని బిక్కుబిక్కుగా విధులు నిర్వహిస్తున్నారు. జమ్మలమడుగు విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయానికి రైతులు ప్రజలు తమ పనులపై నిత్యం వస్తూపోతూ ఉంటారు. అధికారులు సిబ్బందితో పాటు ప్రజలు కూడా సిమెంటు పెచ్చుల వాడి ఎప్పుడు ఎక్కడ తమపై పడుతాయోనని బెంబేలెత్తిపోతున్నారు. కార్యాలయాలన్నీ నిర్మించి

పెచ్చులూడిన కార్యాలయ పైకప్పు

నెర్రెలు వారిన విద్యుత్ శాఖ కార్యాలయ భవనం

చాలా ఏళ్లు కావస్తున్నప్పటికీ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు నూతన నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు విడుదల చేయడం లేదు. మౌలిక వసతులు కల్పించడంలోనూ అధికారులు చొరవ చూపడం లేదు. ఈ కార్యాలయ ప్రాంగణమంతా పిచ్చి మొక్కలతో నిండిపోయి ,విష పురుగులు సంచరిస్తున్నాయని పలువురు ప్రజలు వాపోతున్నారు. కార్యాలయాల ఆవరణలో తుగునీరు, మరుగుదొడ్లు లాంటి కనీస అవసరాలు కూడా లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానని విద్యుత్ శాఖ ఏడీ శేషగిరి బాబు పేర్కొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యానికి మహిళ బలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

వైద్యులు నిర్లక్ష్యం కారణంగా ఓ మహిళ తన ప్రాణాలను పోగొట్టుకుంది. ఈ సంఘటన పట్టణంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. కొండాపురం మండలం చౌటుపల్లి గ్రామ సచివాలయంలో స్వర్ణకుమారి (25) మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్నారు. రెండో కాన్పుకోసం స్థానిక కార్పొరేట్ ఆస్పత్రిలో చేరారు. సాధారణ కాన్పు కుదరకపోవడతో సిజేరియన్ చేయాలని, అందుకోసం రూ. 85 వేలు ఆస్పత్రి యాజమాన్యం తీసుకున్నారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. గురువారం రాత్రి

స్వర్ణకుమారి (ఫైల్‌ఫొటో)

స్వర్ణకుమారి మగబిడ్డకు జన్మనిచ్చారని తెలిపారు. ప్రసవించిన కొద్ది సేపటికి అధిక రక్తప్రవం కావడంతో వైద్యులు తమకు సమాచారం ఇవ్వకుండా వారే వైద్యం చేశారని, చివరి క్షణంలో పరిస్థితి విషమంగా ఉందని, బెంగుళూరు తీసుకెళ్లాలని చెప్పారని పేర్కొన్నారు. వారి సూచన మేరకు వాహనంలో తీసుకెళ్తుండగా మార్గమధ్యలో తమ బిడ్డ చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతురాలి బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. సిసి పుటేజీ, డిశ్చార్జి సమ్మరి, వైద్యం చేసిన వైద్యుల జాబితా ఇవ్వాలని మృతురాలి బంధువులు డిమాండ్ చేశారు. ఎంఎల్ఎ రాచమల్లు ప్రసాద్‌రెడ్డి వారికి సర్ది జెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం : పిఒ

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

సమాజంలో నేటి విద్యార్థులు భావి పౌరులుగా ఎదగాలంటే వ్యక్తిత్వం, క్రమశిక్షణ చాలా ముఖ్యమని సమగ్ర శిక్ష పథకం ప్రాజెక్టు డైరెక్టర అంబవరం ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే విద్యా బోధనపై ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. అంతకు ముందు పదోతరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా 4 లక్షల మంది విద్యార్థులు విద్యాను అభ్యసిస్తున్నట్లు చెప్పారు. లక్ష మంది విద్యార్థులకు మోటివేషన్ క్లాసులను పెట్టి విద్యార్థుల లక్ష్యాన్ని, వ్యక్తిత్వాన్ని, మనస్తత్వాన్ని మార్చే దిశగా ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 27 వేల మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హజరవుతున్నారని తెలిపారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షలు అంటే భయం, టెన్షన్ అనేది లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో మనోధైర్యం, ఆత్మ ధైర్యం నింపే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు ఒక లక్ష్యం అనేది ఉండాలని కోరారు. ఉన్నత శిఖరానికి చేరుకోవాలనే లక్ష్యంతో పాటు క్రమశిక్షణ అనేది తప్పకుండా ఉండాలని చెప్పారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్ వెంకట సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన తనుష్ కుమార్, అశోక్, అభిషేక్, చందు, రాము, రంజీత్, ప్రవీణ్‌కు ఆయన బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి, పర్వీన్, ఉపాధ్యాయులు ఓబులేసు, ధర్మారెడ్డి, శ్రీనివాసులు, ప్రసాద్, క్రిష్ణవేణి, వెంకట సురేష్ పాల్గొన్నారు.

భూ పత్రాలు సమర్పించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ముద్దనూరు

ముద్దనూరు–పులివెందులకు వెళ్లే ప్రధాన జాతీయ రహదారి నాలుగు వరుసల రోడ్డు ఏర్పాటులో భూముల కోల్పోతున్న నిర్వాసితులు తమ భూమికి సంబంధించిన పత్రాలను ఆర్‌డిఒ కార్యాలయంలో సమర్పించాలని ఆర్‌డిఒ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లతో కలిసి భూ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం కోసం మండలంలోని ముద్దనూరు, బొందలకుంట, నల్లబల్లె, చిన్నదుద్యాల, పెద్దదుద్యాల గ్రామాల్లో భూమి సేకరించామని చెప్పారు. భూ నిర్వాసితులకు మార్కెట్ విలువ ప్రకారం కేంద్ర ప్రభుత్వం ధర చెల్లిస్తుందని చెప్పారు. పత్రాలు పరిశీలించి కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పారు. మార్కెట్ విలు ప్రకారమే ధర చెలించి న్యాయం చేయాలని భూ నిర్వాసితులు ఆర్‌డిఒను కోరారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్, సౌజన్య, విఆర్ఒ ఏసోబు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

ప్రణాళికతో చదివితే మెరుగైన ఫలితాలు

సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులు ప్రణాళికతో చదివితే మెరుగైన ఫలితాలు సాధించగలరని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ విద్యార్థులకు వీడ్కోల్ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ప్రతి సబ్జెక్టు పైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మెరుగైన మార్కులు సాధించడానికి సాధన ఒక్కటే మార్గమన్నారు. అన్ని గ్రూపుల విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. తల్లిదండ్రులకు, చదివిన కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మంచి నడవడికతోనే క్రమశిక్షణను పొందవచ్చన్నారు. క్రమశిక్షణ కలిగిన విద్యార్థి ఎక్కడైనా రాణించగలరని తెలిపారు. కళాశాల అధ్యాపకులు నాగరాజు, కోటేశ్వర్ రెడ్డి, సుధాకర్, పద్మావతి, రవీంద్రారెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు ఫేర్వెల్ డే పురస్కరించుకొని విద్యార్థులకు ముగ్గుల పోటీలు, ఫుడ్ ఫెస్టివల్స్, క్రీడా పోటీలు నిర్వహించారు. అందులో రాణించిన విద్యార్థులకు బహుమతులను ద్రానం చేశారు. చివరగా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నకళాజాతా బృందం

ఆర్థిక అక్షరాస్యత తప్పనిసరి

ప్రజాశక్తి - కొండాపురం

నవీన యుగంలో విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యతను తప్పనిసరిగా కలిగి ఉండాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వారి ఆధ్వర్యంలో కళాజాతా ద్వారా తెలిపారు. శుక్రవారం మండలంలోని లావనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యతతో పాటు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు. అప్పుడే సైబర్ నేరగాళ్ల నుంచి తప్పించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సీనియర్ మేనేజర్ అన్వర్, అసిస్టెంట్ మేనేజర్ నాగసాయి కిరణ్, హరిగౌతమ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు హౌస్ బిల్డింగ్ సొసైటీ సమావేశం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణంలో ఈనెల 26న శ్రీ లక్ష్మీనరసింహా టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశం ఉదయం 9గంటలకు ప్రారంభం అవుతుందని చెప్పారు. సొసైటీ సభ్యులందరూ హాజరై సొసైటీ కార్యకలాపాలపై చర్చించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రాష్ట్ర స్థాయికి మొర్రాయపల్లె పాఠశాల ప్రాజెక్టు

హెచ్‌ఎం నాగలక్ష్మిదేవి

ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంఇఒ రవిశంకర్

ప్రజాశక్తి - చాపాడు

అజాదికా అమృత్ మహోత్సవ్ మైక్రో ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్ లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 4525 ప్రాజెక్టులు చేయగా అందులో మండల పరిధిలోని మొర్రాయపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న ఎం.నాగలక్ష్మి దేవి తయారుచేసిన 'బేసిక్ మ్యాథమెటిక్స్ అండ్ పర్మినెంట్ టిఎల్ఎం' ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికైందని ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో 26 జిల్లాల నుండి వచ్చిన అన్ని ప్రాజెక్టుల నుంచి 15 ఎంపిక చేయగా వాటిలో ఈ ప్రాజెక్టు ఎంపికైందని పేర్కొన్నారు. నాగలక్ష్మి దేవి ఎంతో వినూత్నంగా ఆలోచించి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు నేడు మొదటి దశ పనులలో విద్యార్థులు ప్రాథమిక దశలో గణితంలో ఎదుర్కొనే కొన్ని సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి కిటికి నిర్మాణంతో పాటు ఎంతో చక్కటి ప్రాజెక్టును తయారు చేశారన్నారు. వృత్తి పట్ల అంకితభావం, నిబద్ధత అభినందనీయమని ఎంఇఒ అభినందించారు. ఈ ప్రాజెక్టు వీడియోను జిల్లాలోని అందరూ ఉపాధ్యాయులు చూసి మంచి రేటింగ్ ఇవ్వడం ద్వారా ప్రాజెక్టు నేషనల్ లెవెల్‌కు ఎంపిక అవుతుందని, అందుకు సహకరించాలని ఆయన సూచించారు.

ఆర్థిక సాయాన్ని అందిస్తున్న 10వ వార్డు ఇన్‌ఛార్జి కిరణ్

గాయపడిన మహిళకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- జమ్మలమడుగు

పట్టణంలోని కన్నెల్లూరు పదో వార్డులో నివాసమున్న నారాయణ సతీమణికి మిద్దె పైనుండి ప్రమాదవశాత్తు కింద పడి రెండు కాళ్లు విరిగాయి. శుక్రవారం ప్రొద్దుటూరు పట్టణంలోని బి.జి.ఆర్. సాగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. శుక్రవారం జమ్మలమడుగు మున్సిపల్ వైఎస్ ఛైర్మన్ మంగుదొడ్డి సింగరయ్యతో కలసి 10వ వార్డు కౌన్సిరల్ ఎ. సలోమి, వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కిరణ్ బాధితురాలిని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ నారాయణ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో చర్చించడం జరిగింది అన్నారు.

ఎంఇఒ రవీంద్రనాయక్‌కు 'సర్దార్' అవార్డు

ప్రజాశక్తి-చక్రాయపేట

మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాయక్‌కు సర్దార్ వల్లభాయ్ పటేల్ అవార్డు లభించింది. విద్యా ప్రగతిలో విశేష సేవలందించడం, అకడమిక్ స్టాండర్స్ పెంపుదల, డ్రాప్‌అవుట్ నివారణ, పిల్లల్లో పొదుపు, ఆరోగ్యం పెంపుదల, పచ్చదనం పరిశుభ్రత, క్రీడల్లో పురోగతి వంటి వాటిలో విశేష సేవ చేసినందుకు గానూ ఈ ఏడాది జనవరి 30న న్యూఢిల్లీలోని సెంట్రల్ గవర్నమెంట్ ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి పశుపతి కుమార్ చేతుల మీదుగా ఎంఇఒ అవార్డు స్వీకరించారు. ఈనేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ విజయ్‌కుమార్, డిఇఒ దేవరాజు ఆయన్ను అభినందించారు. అవార్డు రావడానికి సహకరించిన ఎంపీ అవినాష్‌రెడ్డికి, వై.ఎస్. కొండారెడ్డి, ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, అధికారులకు ఎంఇఒ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సుభాని

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ప్రజాశక్తి - చాపాడు

విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని తహశీల్దార్ సుభాని సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో పాఠశాల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి అధ్యక్షతన పదవ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమకానికి ముఖ్యఅతిథిగా తహశీల్దార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూర్బా బాలికలకు ప్రభుత్వం విద్యతో పాటు చక్కటి హాస్టల్ వసతిని ఏర్పాటు చేసిందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఎంఇఒ రవిశంకర్ మాట్లాడుతూ 10 ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కష్టపడి చదవాలన్నారు మొదటి స్థానంలో నిలిచే విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. గత ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పులివెందుల టౌన్

పట్టణ పరిధి లోని మెయిన్ రోడ్‌లో కాలువ పనులు నిర్వహిస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎఇ జగదీశ్వర్ రెడ్డి ఒక ప్రకట నలో తెలిపారు. మోర్ సూపర్ మార్కెట్ నుంచి సత్రం పాఠశాల వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటలకు తర్వాత విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ప్రజలు గమనించాలన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No. 131/2021

నాగమల్ల లలితమ్మ @ లలిత, W/o శంకర్, 66 సం॥లు, హిందూ, డోర్‌నెం. 24/564, వసంతపేట, ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం, కడప జిల్లా. **...వాది**

Vs

2. బొబ్బిలి రంగనాయకులు, S/o ఓబన్న, 38 సం॥లు, డోర్‌నెం.7/89–ఎ, డ్రైవర్ కొట్టాల వీధి, ప్రొద్దుటూరు టౌన్, మరియు మండలం, కడప జిల్లా.

4. భూమిరెడ్డి కరుణ్‌రెడ్డి, S/o లేట్ చలమరెడ్డి, 45సం॥లు, హిందూ, డోర్‌నెం. బీ–క్రాస్‌రోడ్డు, వైఎమ్‌ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.

...2,4వ ప్రతివాదులు

దావా సమను మరియు నోటీసు

పై నెంబరు దావాలో 2,4వ ప్రతివాదులు అయిన మీ పైన మరియు మరికొందరిపైన దాఖలు చేసి ఉంటున్నారు. అట్టి దావాలో ఇంజక్షన్ కోరి I.A.No. 132/2021 నెంబరు పిటిషన్‌ను మరియు దావా షెడ్యూల్ దాఖల ఆస్థిని అడ్వకేట్ కమీషనరు ద్వారా హద్దులు తెలుపుటకు గానూ I.A.No. 133/2021 నెంబరు పిటిషన్‌ను దాఖలు చేసి ఉంటున్నారు. పై దావాలో మరియు పిటిషన్‌లలో మీరు హాజరు అగుటకు గానూ 04.04.2023వ తేదీన వాయిదా ఉంటున్నది. సదరు వాయిదా నాడు ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ ఏమైన ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా : 04/04/2023.

//By Order Of the Court//

G. SRINIVASULU, B.Com.,B.L.,
Advocate, Proddatur.